ప్రజాశక్తి

బుధవారం 17 జనవరి 2024 5 విజయనగరం

బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు లో ఆదివారం జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించి సత్తాచాటారు. దీపిల్లి రమణ 55 కేజీల విభాగంలో 5వ స్థానం, పట్నాల లక్ష్మణరావు 75కేజీల విభాగంలో 5వ స్థానం సాధించారు. క్రీడాకారులకు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శంకరరావు, కోరాడ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

పల్లెల్లో కనుమ సందడి

సంక్రాంతి పండగ సందర్భంగా కనుమను పురష్కరించుకుని పల్లెలన్నీ కళకళలాడాయి. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు సాయంత్రం ఇసుక తిన్నెలపై ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులు కొత్తబట్టలు వేసుకొని కలియతిరిగారు. పండగ సందర్భంగా మూడు రోజులూ పలు గ్రామల్లో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. పలుచోట్ల కోడిపందేలు, ఎడ్ల పందేలు జరిగాయి.

ప్రజాశక్తి-వేపాడ

గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. కనుమ సందర్భంగా మంగళవారం సాయంత్రం పిల్లలు, పెద్దలు నది పరివాహక ప్రాంతాలకు చే రుకొని ఆటపాటలతో అలరించారు. చిన్ననాటి జ్ఞాపకలను గుర్తుకు తెచ్చుకొని పులకించిపోయారు. మరికొన్ని గ్రామాల ప్రజలు పట్టణాలకు చేరుకొని సందడి చేశారు.

మండలంలోని కొండ గుల్ల వద్ద వెలసిన శ్రీ బ్రహ్మ లింగేశ్వర ఆలయం వద్ద నిర్వహించిన జాతరకు పరిసర ప్రాంతాలైన గ్రామాలు గుడివాడ, జగ్గయ్యపేట, సింగరాయి, ఆకుల సీతంపేట, వేపాడ, వల్లంపూడి, డి ఆర్ పేట, చామలపల్లి, కరకవలస, జాకీర్ గ్రామాల నుంచి వందలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీతానగరం : సువర్ణముఖి నది తీరాన జనాల సందడి

వేపాడ : కృష్ణరాయుడుపేటలో జరుగుతున్న ఎడ్ల బండ్ల పోటీలు

హోరాహోరీగా ఎడ్ల బండ్ల పోటీలు

కృష్ణరాయుడుపేటలో నిర్వహించిన శ్రీకృష్ణరాయుడు జాతర సందర్భంగ ఎడ్ల పరుగు పందాలు హోరాహోరీగా సాగాయి. పరుగు ప్రదర్శనలో మొదట విజేతగా నిలిచిన ఎడ్ల బండికి రూ.14వేలు నగదు. రెండో విజేతగా నిలిచిన ఎడ్ల బండికి రూ.12వేలు, మూడో విజేతకు రూ.10వేలు, నాలుగో విజేతకు రూ.8వేలు, ఐదో విజేతకు రూ.6వేలు, ఆరో విజేతకు రూ.4వేలు అందజేశారు. గ్రామ పెద్దలు వైసీపీ నాయకులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గజపతినగరం : మండలంలోని పురిటిపెంట, గంగచోళ్లపెట, పట్రువాడ, కొణిశ, మెంటాడ మండలం మెంటాడ, జిటిపేట తదితర గ్రామాల ప్రజలు చంపావతి నది తీరాల్లో సందడి చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం సువర్ణముఖి నది సమీపంలో ఉన్న గ్రామాలు గెడ్డలుప్పి, సీతానగరం, లక్ష్మీపురం, బుర్జ గ్రామాల ప్రజలు ఇసుక దిబ్బలకు వచ్చి కొత్త అల్లుళ్ళు, కొత్త కోడళ్ళ తో పలు ఆటలు ఆడుకున్నారు. కొత్త పరిచయాలతో సందడి సందడిగా జరిగింది.

దొంతి కొండకు పోటెత్తిన సందర్శకులు

కురుపాం : సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణాల నుండి పల్లెలకు వచ్చిన వారు మండలంలో మొండెంఖల్లు గ్రామంలో ఉన్న దొంతి కొండకు వేల సంఖ్యలో చేరుకుని సందడి చేశారు. కొండల నడుమ వెలిసిన నీలమ్మ తల్లిని దర్శనం చేసుకుంటారు. ఇది ఏటా సంక్రాంతి, కనుమ రోజున ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

భార్య గంగమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త గంగులు; మృతదేహాన్ని డోలీకి కట్టి చిట్టెంపాడు తీసుకెళ్తున్న గిరిజనులు

చిట్టెంపాడులో విషాదం

- మొన్న బిడ్డ.. నేడు తల్లి కన్నుమూత
- డోలీమోతలతో నిత్యం అవస్థలు
- అయినా స్పందించని పాలకులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని మూల బొడ్డవర పంచాయతీలో హృదయ విదాకరణమైన సంఘటన చోటు చేసుకుంది. గిరి శిఖర గ్రామం చిట్టెంపాడు గిరిజనులు అనారోగ్యం బారినపడితే డోలీ మోతలే వారికి గత్యంతరం అవుతున్నాయి. వారికి రహదారి సదుపాయం లేకపోవడంతో వారి ప్రాణాలు గాలిలోనే కలిసిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 57ఏళ్లవుతున్నా గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేకపోవడంతో గ్రామంలో నిత్యం మరణాలు సంభవిస్తున్నాయి.

చిట్టెంపాడు గ్రామానికి చెందిన మాదల గంగమ్మ, తన ఆరు నెలల చంటిబిడ్డ తీవ్ర అనారోగ్యం బారిన పడడంతో ఈనెల 5న భర్త గంగులు తోటి గిరిజనుల సహాయంతో వారిని డోలీలో ఏడు కిలోమీటర్లు మోసుకుంటూ బొడ్డవర వరకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి 108 వాహనంలో వైద్యం కోసం శృంగవరపుకోట పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా విశాఖ కెజిహెచ్‌కు తల్లీ బిడ్డను రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరు నెలల పసిపాప ఈనెల 7న మృతి చెందింది. గంగమ్మ కూడా పరిస్థితి విషమించి మంగళవారం కన్ను మూసింది. ఈనేపథ్యంలో గంగమ్మ మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో మండలంలోని బొడ్డవర వరకు తీసుకొచ్చి వదిలేయడంతో బొడ్డవరం నుంచి ఆమె భర్త గంగులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొడ్డవర రైల్వే స్టేషన్ వరకు ద్విచక్ర వాహనం మధ్యలో మృతదేహాన్ని పెట్టి తీసుకువెళ్లాడు. అక్కడినుంచి డోలీపై ఏడు కిలోమీటర్లు గిరి శిఖర చిట్టెంపాడు గ్రామానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించాడు. ఈఘటన స్థానికులను తీవ్రంగా కలిసివేసింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. డోలి మోతలపై ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

ఈనెల 5న డోలీపై తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనులు (ఫైల్)

గిరిజన ప్రాంతాల్లో వసతుల కల్పన

ప్రజాశక్తి-గంట్యాడ

ఆదివాసీ గిరిజన తెగల వారు నివసించే ప్రాంతాల్లో మైదాన ప్రాంతాలతో సమానంగా ప్రజలకు మౌళిక వసతులు కల్పించడం, గిరిజనుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ మహా అభియాన్(పిఎం జన్‌మన్) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. ఆదివాసీ గిరిజనుల అవసరాలు గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో నెరవేర్చేలా ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తాయన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఆదివాసీ గిరిజనులు నివసించే 42 గ్రామాల్లో పన్నెండు ప్రభుత్వ శాఖల ద్వారా వారి అవసరాలు గుర్తించే ప్రక్రియ చేపట్టామన్నారు. పిఎం జన్‌మన్ పథకం కింద ప్రయోజనం పొందుతున్న ఆదివాసీ గిరిజనులతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం ఆన్‌లైన్‌లో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాకు సంబంధించి గంట్యాడ మండలం కిల్తంపాలెం పంచాయతీ శివారు గ్రామం డెప్పూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులతో కలసి జిల్లా కలెక్టర్ తదితరులు ప్రధానమంత్రి నరేంద్రమోడితో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం కిసాన్, పిఎం జెఎవై వంటి పథకాల కింద అర్హులైన వారు ఎవరైనా మిగిలి వుంటే వారిని గుర్తించి పథకాలు వర్తింపచేయడం, ఆధార్ నమోదు కాని వారిని గుర్తించి ప్రత్యేక ఆధార్ క్యాంపుల ద్వారా ఆధార్ చేయించడం వంటి కార్యక్రమాలు చేపడతా మన్నారు. గిరిజనులు వంద జనాభాకు పైబడి వున్న గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

జిల్లాలో ఇప్పటికే 124 మంది ఆదివాసీలకు ఒక్కొక్కరికీ రూ.2.39 లక్షల వ్యయంతో పక్కా ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఆదివాసీలకు ఇళ్లనిర్మాణం కోసం అడ్వాన్సుగా రూ.70 వేలు మంజూరు చేస్తామన్నారు. ఎస్.కోట మండలం చిట్టెంపాడు గ్రామానికి రోడ్డు లేకపోవడంతో అక్కడి గర్భిణీలను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే రూ.10 కోట్లతో ఆ గ్రామానికి రోడ్డు మంజూరు చేశామన్నారు. వన్‌ధన్ కింద ఆదివాసీ మహిళలతో స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటుచేసి వారు సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం ద్వారా తగిన మద్ధతు ధర కల్పించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు పిఎంజెఎవై హెల్త్ కార్డులను కలెక్టర్ అందజేశారు. పలువురు గిరిజన కళాకారులు థింసా నృత్యాన్ని ప్రదర్శించారు.కేంద్ర ప్రభుత్వ ట్రైఫెడ్ డిప్యూటీ మేనేజర్ సుమన సాహా, గిరిజన సంక్షేమ అధికారి టి.చంద్రశేఖర్ రావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఐసిడిఎస్. ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతకుమారి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కలెక్టర్

సభలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

19న అంబేద్కర్ స్మృతివనం ప్రారంభం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహనీయుడిని, యావత్ భారత జాతికి ఆదర్శ ప్రాయుడని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సుమారు 18.81 ఎకరాల స్థలంలో రూ.400 కోట్ల ఖర్చుతో, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ స్మృతివనం, కాంస్య విగ్రహ ఆవిష్కరణ ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా, పాదపీఠం ఎత్తు 85 అడుగులు అని, దీంతో మొత్తం విగ్రహం ఎత్తు 210 అడుగులు ఉంటుందన్నారు.

దేశంలోని అతిపెద్ద విగ్రహాలలో మూడోది అని తెలిపారు. స్మృతి వనంలోని అంబేద్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, సుమారు 3 వేలమంది కూర్చోవడానికి వీలుగా మల్టీ కన్వెన్షన్ సెంటర్, లైబ్రరీ, మినీ థియేటర్, ఫుడ్ కోర్టు, చిన్నారులకు ప్లే ఏరియా, గార్డెన్లు, మ్యూజిక్ ఫౌంటెయిన్, వాటర్ ఫౌంటెయిన్లు కూడా సిఎం జగన్ ప్రారంభిస్తారని వివరించారు. ఈ ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎస్.కోట మండలంలో సాగుతున్న కోడిపందేలు

జోరుగా కోడిపందేలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట, సాలూరు

సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల జోరుగా కోడిపందేలు సాగాయి. పండగ మూడు రోజులూ యథేచ్ఛంగా పందేలు జరగ్గా, లక్షలాది రూపాయలు బెట్టింగ్‌లు జరిగాయి. ఎస్.కోట మండలంలోని పెద్దకండేపల్లి. ఆలుబిల్లి, వసి తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా కోడి పందేలను సాగించినప్పటికీ పోలీసులు జాడ కాన రాలేదు. కోడిపందాలు నిర్వహించకూడదని హైకోర్టు ఆదేశించిన ఎక్కడా ఆ ఆదేశాలు పనిచేయలేదు.

సాలూరు మండలం మామిడిపల్లి, తోణాం, గంగదొరవలస తదితర చోట్ల కోడిపందేలు జోరుగా సాగాయి. గజపతినగరం, మెంటాడ మండలాల్లోని చంపావతి నది అవతల గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి.

పెద్దగా జన సంచారం లేని ఎంజి రోడ్డు

బోసిపోయిన నగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతి పండగ నేపథ్యంలో విజయనగరం ప్రధాన రహదారులన్నీ బోసిపోయాయి. సంక్రాంతి పండగకు అత్యధిక మంది తమ స్వగ్రామాలైన పల్లెటూళ్లకు వెళ్లిపోవడంతో నగరంలోని ప్రధాన జంక్షన్‌లు కర్ఫ్యూ విధించినట్లు బోసిపోయి. గంటస్తంభం, మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, బాలాజీ జంక్షన్, ఎత్తుబ్రిడ్జి, అర్అండ్‌బి జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్‌లో వాహనాల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. జన సంచారం పెద్దగా లేకపోవడంతో నిర్మానుష్యంగా మారాయి. మరో వైపు ఉద్యోగులు, ప్రజలు గ్రామాలు తరలిపోవడంతో వీధులు కూడా బోసిపోయాయి. బోగీ రోజు వరకు కిట కిట లాడిన విజయనగరం సోమవారం జనాలు లేక వెలవెలబోయింది.

బోసిపోయిన ఆర్‌టిసి కాంప్లెక్సు రహదారి

రాజన్నదొరకు సమస్యలు వివరిస్తున్న అంగన్వాడీలు

పండగలోనూ ఆగని పోరాటం

36వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురం, విజయనగరం

సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సంక్రాంతి పండగలోనూ కొనసాగింది. మంగళవారం నాటికి సమ్మె 36రోజులకు చేరుకుంది. పండగ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో అంగన్వాడీలు వినూత్న నిరసనలు చేపట్టారు. మెరకముడిదాం మండలం సోమలింగాపురం వచ్చిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు అంగన్వాడీలు వినతినిచ్చారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచి అంగన్వాడీలు సమ్మె విరమించాలని మంత్రి కోరారు. అంగన్వాడీల డిమాండ్లలో పదింటికి ప్రభుత్వం అంగీకరించిందని, సమ్మె కాలంలో జీతాలు కూడా ఇస్తామని తెలిపారు. ఎన్నికల ముందు జీతాలు పెంచడం సరికాదని, రెండు నెలలు ఆగితే వెయ్యి కాదు రెండు వేలు ఇస్తామని అన్నారు.

కురుపాంలో దీక్షా శిబిరం వద్ద వినూత్న రీతిలో గంగిరెద్దుకు తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ల జిల్లా అధ్యక్షులు పి.సరళ కుమార్, ప్రాజెక్టు కార్యదర్శి జె.సరోజ, సెక్టర్ లీడర్లు ఎం. మీనాక్షి, డివి రత్నం, బి. జయలక్ష్మి, ఎస్. సులోచన, డి. జ్యోతిలక్ష్మి, ఎన్. సుమతి తదితరులు పాల్గొన్నారు. **సీతంపేట** ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీలు వంటకాలు చేసి నిరసన తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు పాలక సాంబయ్య సమ్మెకు సంఘీ బావం తెలిపారు. **సీతానగరం** మండల కేంద్రంలో కుటుంబ సభ్యులను బంధువులను ఇంటి వద్ద విడిచిపెట్టి అంగన్వాడీలు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంక్రాంతి, కనుమ పండగలను లెక్కచేయకుండా నిరసన శిబిరాన్ని కొనసాగించారు. అంగన్వాడీ ఆడపడుచులకు పండుగను దూరం చేసిన గుండె లేని బండరాయి ప్రభుత్వమని జిల్లా అంగన్వాడీల యూనియన్ కార్యదర్శి గంట జ్యోతి, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, వాకాడ ఇందిరా అన్నారు. సమ్మె శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సందర్శించగా వినతి అందించారు. **సాలూరులో** అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీ ఇచ్చారు.

మృతి చెందిన నర్సకుమారి, మహేష్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని కోమటపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పార్వతీపురం నుంచి విశాఖ వె ళ్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు.

పార్వతీపురంలోని బెలగాం అగ్రహారం వీధికి చెందిన నలితం మహేష్ (45) ఆర్మీలో పనిచేసి రిటైర్డు అయ్యాక విశాఖలోని ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. పార్వతీపురంలోనే నివాసం ఉంటూ విశాఖ వెళ్లి వస్తుంటారు. మంగళవారం కనుమ పండగ ముగించుకొని విశాఖలో రాత్రి డ్యూటీ ఉన్నందున చిన్నాన నలితం సత్యనారాయణ(64), నర్సకుమారి (53)తో కలిసి విశాఖ వెళ్తున్నారు. దత్తిరాజేరు మండలం కోమటిపల్లి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో మహేష్, ఆయన పిన్ని అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మహేష్‌కు భార్య సబిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటతో బెలగాంలో విషాదం అలముకుంది. ఆయన మృతితో తల్లీపిల్లలు రోధిస్తున్నారు. మానాపురం ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కారును ఢీకొన్న లారీ

బట్టలు పంపిణీ చేస్తున్న మేలు కొలుపు సభ్యులు

పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ఆరికతోటలో మేలుకొలుపు బృందం ఆధ్వర్యాన పేదలకు బట్టలు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతీయేటా మేలుకొలుపు బృందం వస్త్రాలు పంపిణీ చేయడం సాంప్రదాయం. ధనుర్మాస ప్రారంభం నుంచి బోగీ పండుగ వరకు ప్రతీ రోజు తెల్లవారు జాము నుంచే హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ బాజా బజంత్రీలుతో ప్రజలను మేలుకొలుపుతూ వారు ఇచ్చిన కానుకలు స్వీకరించి వాటిని ఈ నెలంతా పోగు చేసి వాటితో వస్త్రాలు కొనుగోలు చేసి పంపిణీ చేసే సాంప్రదాయం సుమారు 50 ఏళ్లకు పైబడి జరుగుతుంది. అప్పట్లో పెంకి తవిటియ్య దాసు, రంగదాసు వంటి ప్రముఖ భాగవతారులు ఈ ఆనవాయితీని ప్రారంభించగా ఇప్పటికీ వారి శిష్య బృందం దీన్ని కొనసాగిస్తోంది. సుమారు వెయ్యి మందికి వస్త్ర దానంతో పాటి అన్న వితరణ చేసి మన్ననలు పొందుతున్నారు. గ్రామస్తులు కూడా వీరు చేస్తున్న కృషికి శక్తి మేర వితరణలు అందజేసి ప్రోత్సహిస్తున్నారు.

4వందల మంది పేదలకు బట్టలు పంపిణీ

రేగిడి : మండలంలోని లింగాల వలసకు చెందిన అడపా చిరంజీవి నాయుడు తన తల్లి సీతమ్మ పేరిట సంక్రాతి సందర్భంగా నాలుగు వందల మంది పేదలకు వస్త్రదానం చేశారు. గత పదేళ్లగా లింగాలవలస, చిన లింగాల వలస, తోకల వలస, వావిలవలస గ్రామాలకు చెందిన వృద్దులకు, వితంతులకు, వికలాంగులకు వస్త్ర దానం చేస్తున్నట్లు చిరంజీవి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సైలాడ రాంబాబు ఉన్నారు.

ఎస్.సి.కమిషన్ ఛైర్మన్ నేడు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జిల్లా పరిషత్ అతిథి గృహానికి చేరుకొని మీడియా ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 2 గంటలకు శ్రీకాకుళం బయలుదేరి వెళతారని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి తెలిపారు.

ఒక చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మంచి సమాజ నిర్మాణానికి పూర్వ విద్యార్థులంతా కృషి చేయాలని ఆర్‌సిఎం పాఠశాల పూర్వ హెచ్‌ఎం డాక్టర్ ఫాదర్ ప్రతాప్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌సిఎం పాఠశాలలో 2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ క్రమశిక్షణతో బాగా చదువుకుని మంచి స్థానాల్లో స్థిరపడ్డ విద్యార్థులు సహచరులను ఆదుకోవాలన్నారు. ఆహార్యంలో జాగ్రత్త పాటించి వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణ తో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి కమిటీ కన్వీనర్ నాగిరెడ్డి రాంబాబు, కో కన్వీనర్ అప్పికొండ్ కిషోర్, కె.బాబూరావు, జె.నారాయణ మూర్తి, ఉపాధ్యాయులు కె.రాములు, పి.శ్రీనివాస రావు, అర్.రాజమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని మెరైన్ ఇంజినీర్ గేదెల అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.బూర్జవలస ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, యువతకు చదువు-ఉపాధి అవకాశాలుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, క్రమశిక్షణతో చదివితే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, అబ్దుల్ కలాం యూత్ అసోసియేషన్ సభ్యులు బి.గణపతిరావు, కె.చంద్రశేఖర్, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

63 బాటిళ్లు మద్యం పట్టివేత

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని చనమల్లపేటలో 62 అక్రమ మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బుధ వారం గుషిని పంచాయితీ పరిధి చనమల్ల పేటలో ఎస్ఐ డి. రామ గణేష్ అక్రమ మద్యం అమ్మకాలపై సమాచారం అందడంతో పోలీసులతో దాడి చేసి 62 బాటిళ్ల పట్టుకున్నారు. నిందితున్ని పోలీసు స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు జరిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

శృంగవరపుకోట

పేదలి ఆకలి తీర్చడమే లక్ష్యంతో మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి అన్నారు, 167వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా మంగళవారం మధ్యాహ్నం 300 మంది పేదలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిక్కా కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయి రాం), ఎస్.కోట మండల ఐటిడిపి అధ్యక్షులు గనివాడ బంగారు నాయుడు, హైటెక్ సురేశ్, భీశెట్టి మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న టిడిపి నాయకులు

పడకేసిన ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు

- జైకా నిధులున్నా.. పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- రైతులకు సకాలం అందని సాగునీరు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు పడకేశాయి. సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరణ చేసి రైతులకు సంపూర్ణంగా సాగునీరు ఇచ్చేందుకు జైకా నిధులు మంజూరై ఐదేళ్లు గడిచినా ఆధునీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో ఆధునీకరణ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు.

సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు నత్తనడకన సాగడంతో రైతులకు సకాలంలో సాగునీరు అందడం లేదు. సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న సాలూరు, మక్కువ, బొబ్బిలి, సీతానగరం మండలాల రైతులకు సాగునీరు అందించే వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు

బొబ్బిలిలోని ఇరిగేష్ కార్యాలయం

ఆధునీకరణకు జైకా నిధులు రూ.48.89కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.10కోట్లు విలువ చేసే పనులను మాత్రమే కాంట్రాక్టర్ పూర్తి చేశారు. కాంట్రాక్టర్ కు ప్రభుత్వం రూ.3.76కోట్లు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.6.27కోట్లు చెల్లించాల్సి ఉంది. బిల్లులు చెల్లించకపోవడంతో పనులను కాంట్రాక్టర్ నిలిపివేసి టెండర్‌ను రద్దు చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరినట్లు సమాచారం. విఆర్ఎస్ ఆధునీకరణ పూర్తి కాకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. బొబ్బిలి మండలం శివారుగా ఉండడంతో నీరు అందే పరిస్థితి లేక రైతులు వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురిస్తుంది. సీతానగరం మండలంలో ఉన్న పెద్ద అంకలాం ఆనకట్ట ఆధునీకరణకు రూ.14కోట్లు మంజూరవ్వగా రూ. కోటి 5లక్షల విలువైన పనులు చేశారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ కు రూ.65లక్షలు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.49లక్షలు చెల్లించాల్సి ఉంది. వీటి పనులను కూడా చేయలేమని, టెండర్ రద్దు చేయాలని కాంట్రాక్టర్ కోరుతున్నట్లు తెలిసింది. వట్టిగెడ్డ ఆధునీకరణకు రూ.39.24కోట్లు మంజూరవ్వగా ఇప్పటి వరకు రూ.3.90 కోట్లు పనులు పూర్తి చేశారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు రూ.2.60 కోట్లు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.1.30 కోట్లు బకాయి ఉంది. పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.23.83కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.6.20 కోట్లు పనులు పూర్తి చేశారు. కాంట్రాక్టర్ కు రూ.4.80 కోట్లు బిల్లులు చెల్లించగా ఇంకా రూ.1.40కోట్లు చెల్లించాల్సి ఉంది. టెండర్ ను రద్దు చేయాలని కాంట్రాక్టర్

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు గేట్లు

కోరుతున్నట్లు తెలిసింది.

రైతులకు సక్రమంగా అందని సాగునీరు

సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు జరగకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. దీంతో పంటలు సక్రమంగా పండడం లేదని రైతులు వాపోతున్నారు. జైకా నిధులతో షెటర్ల మరమ్మతులు, సాగునీటి కాలువలలో పూడికలు తొలగించాల్సి ఉన్నప్పటికీ జరగలేదు. దీంతో షెటర్లు పాడైపోయి నీరు వృథాగా పోతుంది. కాలువలలో పూడికలు పేరుకుపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందే పరిస్థితి లేదు. వర్షాలు అనుకూలించకపోతే పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైకా నిధులతో సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు పూర్తి చేసి పంటలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు కృషిచేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రహదారి ప్రమాదాల నివారణకు ఆర్‌టిసి సిబ్బంది కృషి చేయాలని స్థానిక డిపో మేనేజర్ కె.రమేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం రహదారి భద్రతా వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి నెలరోజులు పాటు జరిగే ఈ మాసోత్సవాల్లో ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16 తేదీ నుంచి 18 వరకు డ్రైవర్స్, మెకానిక్‌లకు శిక్షణ, 19 నుంచి 24 వరకు బస్సుల కండిషన్ మెరుగుదల, 25 నుంచి 28 వరకు డ్రైవర్లకు ఫ్యామిలీ కౌన్సిలింగ్, 29 నుంచి 31 వరకు డ్రైవర్లకు సేఫ్టీ అలవెన్సు పంపిణి, ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు వైద్య పరీక్షలు, 6 నుంచి 9 వరకు విద్యార్థుల భాగస్వామ్యం తో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం, 10న రక్తదాన శిబిరం, 11 నుంచి 13 వరకు ప్రమాదాలపై ఆడిట్, 15న డ్రైవర్ల కు అభినందన సభ ఉంటుందని తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన

విజయనగరం కోట : స్థానిక విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ గ్యారేజ్‌లో రహదారి భద్రత వారోత్సవాలను డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 14వరకు రహదారి భద్రత మాసోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా డిపో మేనేజరు జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బి. ఆదినారాయణ, మెకానికల్ ఇంచార్జి ఎస్. హేమంత్ కిషోర్, డిపో హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ రవికుమార్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఐక్యత రావాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సంక్రాంతి సంబరాలు గ్రామాల్లో ఐక్యత వస్తుందని చిన బూరాడ పేట సర్పంచ్ బెల్లాన అప్పయ్యమ్మ, తుమ్మలపేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు అన్నారు. మంగళవారం చిన బూరాడ పేటలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సంబరాలు నిర్వహించడం ద్వారా ఐక్యత వస్తుందన్నారు. ముఖ్యంగా మన సంప్రదాయాలు పాటించి వాటిని భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ప్రెసిడెంట్

ఎల్.సత్య నారాయణ, బెల్లాన రామారావు, బి. రాజి నాయుడు, సి హెచ్ సత్యనారాయణ, ఎన్. అచ్చెం నాయుడు, నాగ రాజు, ఎం.నారాయణరావు, వై. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాంస విక్రయాల షాపుల వద్ద రద్దీ

మటన్, చికెన్ ధరలకు రెక్కలు

కిటకిట లాడిన మాంసం విక్రయ కేంద్రాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతి కనుమ పండగ నేపథ్యంలో మాంసం ధరలకు రెక్కలు వచ్చాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా ,పేద ధనిక అనే తారతమ్యం లేకుండా అన్ని ఇళ్లల్లో మంగళవారం కనుమ సందర్భంగా మాంసం వంటలు వండుకొని తింటారు. ఈ నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ఒక్క సారిగా మాంసం ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. మటన్ కేజీ రూ. 800 నుంచి 900కు, చికెన్ రూ.160 నుంచి 200, రూ.240కు పెరిగిపోయాయి. చేపలు కేజీ 140 నుంచి 160కు పెరగ్గా, నాటు కోడి మాంసానికి మరింత గిరాకీ పెరిగిపోయింది. కేజీ మాంసం 750 నుంచి రూ.1000కి చేరిపోయింది. దీంతో కొనుగోలు దారులు బెంబేలెత్తి పోయారు. ధరలు పెరిగినా తప్పదు కాబట్టి ఇదే అదునుగా వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. పండగ కావడంతో ఉదయం 5 గంటల నుంచే మాంసం విక్రయ కేంద్రాల వద్ద జనం బారులు తీరారు.

కనుమ వేడుకల్లో కడుబండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పెదకండేపల్లిలో జరిగిన కనుమ వేడుకల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెద్దఖండేపల్లి గ్రామస్తులుఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందుగా అందరికి సంక్రాంతి శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలం పార్టీ ప్రెసిడెంట్ మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పోతనపల్లి వెంకటరావు, పుణ్యగిరి ట్రస్టు ఛైర్మన్ పొలమరశెట్టి రామకృష్ణ, ఎంపిటిసి కడారి అప్పయ్య, వెంకటరమణపేట ఆవాల కృష్ణ, వీరనారాయణం మమ్ములూరి సోంబాబు, వసి బంగారునాయుడు, ఎలమంచిలి అప్పలసత్యం, సరిపల్లి గణేష్,మోపాడ కోటి, సోషల్ మీడియా కో కన్వీనర్ మామిడి బుజ్జి, పెదఖండేపల్లి రంబ వెంకటరమణ, చిన్న మాస్టర్, వైస్ సర్పంచ్ యరపాటి సూర్యనారాయణ, గ్రామ యువకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

డిఎస్‌సి ప్రకటన విడుదల చేసి రాష్ట్రంలో వివిధ యాజమాన్యాలలో ఉన్న సుమారు 24 వేల ఉపాధ్యాయ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు జె సి రాజు, బంకురు జోగినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ , ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంద అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఐదేళ్లు గడుస్తున్నా ఉపాధ్యాయ నియామక ప్రకట విడుదల చేయకపోవడం అన్యాయమని అన్నారు. మోడల్ పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న సిబ్బందిని విద్యాశాఖాలో విలీనం చేయాలని,ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తింప చేసే అన్ని సౌకర్యాలు, కారుణ్య నియామకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు వర్తింపచేసి వారికి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. జోగినాయుడు మాట్లాడుతూ డిఎ, పిఆర్‌సి, సిపిఎస్ ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలు తక్షణ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిహెచ్‌జె ప్రవీణ్, భక్త దర్శనం, శ్రీనివాసరావు, ఎల్లయ్య, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

'జ్ఞాపకాల పొరల్లోంచి' పుస్తకావిష్కరణ

- గంటేడ స్వగ్రామంలో కార్యక్రమం నిర్వహణ
- తల్లి సోములమ్మకు పుస్తకం అంకితం

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం మన్యం జిల్లాలో కథ, కవిత్వం, పాట, పద్యం అన్ని ప్రక్రియల్ని సమర్థవంతంగా నిర్వహించ గలిగిన ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడు రచించిన 'జ్ఞాపకాల పొరల్లోంచి' (ఫేస్ బుక్ సీరియల్) పుస్తకావిష్కరణ సంక్రాంతి పండుగనాడు రచయిత స్వగ్రామంలో దళాయిపేటలో జరిగింది. పాడుదమా స్వేచ్ఛాగీతం గీతరచయితగా ఖ్యాతి గడించిన గంటేడ స్నేహకళాసాహితీను స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవుల్ని, కథకుల్ని తయారు చేసిన ఘనత ఆయనకే స్వంతం. జాతీయ, రాష్ట్రీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు, రివార్డులు అందుకున్న ఘనత ఆయనకే దక్కుతుంది. అటువంటి గౌరు నాయుడు తానుపుట్టి 70 సంత్సరకాలంలో తన జ్ఞాపకాలను 70అంశాలను కథలుగా రాసి పది కాలాలపాటు పదిలపరచుకునేల అక్షరబద్ధంచేశారు. ఆయనతండ్రి సత్యం ప్రచురణలుగా నాగేటి చాలుకు నమస్కారం (దీర్ఘ కావ్యం), సేద్యగాడు (పద్యాలు), నేడు మూడో పుస్తకంగా తల్లిసోములమ్మ 90ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జ్ఞాపకాలు పొరల్లోంచి పుస్తకాన్ని ఆవిష్కరించి తల్లికి అందజేసారు. స్వగ్రామంలో తల్లి సోములమ్మ, కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య సంక్రాంతి పండుగ నాడు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని రచయిత గంటేడ గౌరునాయుడు తెలిపారు. ఆయన రాసిన యాస భాషకు శ్వాస, నాబాల్యం, మా సిద్ధాంతి, బీడీ సత్యం, బడి, పూలరంగడు మా సోమలింగం మేస్టారు, గుంప యాత్ర, మాతృ ప్రేమ, బుర్రకథ, పోడుమంట, నవోదయ గ్రంథాలయం, భయపెట్టిన నందుగాడి మిమిక్రీ, జాలారి భాగోతం, కవిత్వంతో ఒక సాయంత్రం, తదితర అంశాలపై రాసిన కథలపై అందరి అభిప్రాయాలని రచయితతో ముచ్చటించు కున్నారు. ఈ కార్యక్రమంలో గంటేడ చిన్నంనాయుడు, గౌరీశ్వరి, జానకమ్మ, శ్రీలంకి త్రినాథరావు మాస్టారు, పోల మధుసూధనరావు, దనుకొండ చంద్రశేఖరరావు, పిన్నింటి నారాయణమ్మ, పార్వతమ్మ, భారతమ్మ, సందీప్ హరిణి ,శ్రావణీ, లావణ్య,స్వప్న, కిరణ్, క్రాంతి, వివేక్, రోజారమణి, మానస, లహరి, భాను, కార్తీక్, మంతిని తిరుమల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గౌరినాయుడు తల్లిని సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు

టిడిపి శ్రేణుల్లో అయోమయం

- ఎమ్మెల్యే అభ్యర్థి పై కొనసాగుతున్న ఉత్కంఠ
- జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం

ప్రజాశక్తి -సాలూరు

నియోజకవర్గ టిడిపి శ్రేణుల్లో అయోమయం నెలకొంది. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణితో పాటు కొత్తగా మరో గిరిజన మహిళా నాయకులు ఎం.తేజోవతి ఎమ్మెల్యే సీటును ఆశిస్తున్నారు. సంధ్యారాణి గడిచిన ఐదేళ్లుగా నియోజకవర్గ ఇన్ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. టికెట్ తనకే వస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ గ్రూపు నాయకులు తేజోవతిను తెరపైకి తెచ్చారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం కోసం నాయకులు, కార్యకర్తలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. పార్టీకి అన్ని మండలాల నాయకులను కలుపుకుని పోవడంలేదనే కారణంతో కొంతమంది మండల నాయకులు సంధ్యారాణిని వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త అభ్యర్థిని రంగంలోకి దించితే ఉన్న తక్కువ సమయంలో జనంలోకి నెట్టుకు రాగలమా లేదా అని అధిష్ఠానం తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలుస్తోంది.

జనసేనకే కేటాయిస్తారనే ప్రచారం

టిడిపి, జనసేన పార్టీల మధ్య పొత్తులో భాగంగా నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం కూడా మరోవైపు జరుగుతోంది. ఒకవేళ జనసేనకు కేటాయిస్తే టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏ మేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. రాష్ట్ర స్థాయి లో జనసేన, టిడిపి నాయకుల మధ్య ఉన్నంత బలంగా సంబంధాలు నియోజకవర్గ స్థాయిలో కనిపించడం లేదు. నియోజకవర్గ స్థాయిలో కూడా టిడిపికి ఉన్నంత సమర్థ నాయకత్వం జనసేనకు లేదు. టిడిపిలో నెలకొన్న గ్రూపు రాజకీయాల తలనొప్పి కారణంగా ఆ పార్టీ నాయకత్వం జనసేనకు కేటాయిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారపార్టీపై ప్రజా వ్యతిరేకత ఉన్నప్పటికీ దాన్ని సొమ్ము చేసుకునే పరిస్థితిలో ప్రతిపక్ష నాయకులు లేకపోవడం, ఇంటి పోరును చక్కదిద్దుకోలేకపోవడం కూడా వారికి మైనస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ఏమైనా తాజా పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తోంది.